


# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా






సంపుటి - 07 | సంచిక 74 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 13, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ఉస్మానియా అభివృద్ధి ఉత్తమాటేనా..?



- ఉస్మానియా అభివృద్ధికి 1,000 కోట్ల కేటాయింపు ఏమాయెను
- ప్రతి విశ్వవిద్యాలయంలో కిందిస్థాయి అధికారులు కుమ్మకుంటున్నారు
- అవినీతిపరులే ఉన్నతాధికారులను బొల్తా కొట్టిస్తున్నారు
- ప్రతి విశ్వవిద్యాలయంలో హాస్టల్స్ పరిపాలన అస్తవ్యస్థంగా ఉంది
- హాస్టల్లలో దోచుకున్నోడికి దోచుకున్నంత
- నీతిగా పనిచే సేవాళ్ళను తొక్కేస్తున్నారు
- ఉద్యమ కేంద్రాలకు నిలయాలైన విశ్వవిద్యాలయాలు చిన్నబోతున్నాయి
- మేధావుల కేంద్రాలు మందగిల్లుతున్నాయి
- విద్య నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి
- ఉన్నతాధికారులపై అవినీతిపరులు బోలెడు ఒత్తిడి తెస్తున్నారు
- డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్న అధికారులపై ప్రభుత్వం కొరడా జులిపించాలని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. తప్పులకు పాల్పడుతున్న అధికారులపై ఆయా విశ్వవిద్యాలయాలలో పలు రకాల కమిటీలు వేయబడుతున్నప్పటికిని కమిటీలను నివేదికల ఆధారంగా ప్రభుత్వ స్థాయిలో క్షేత్రస్థాయి విచారణలు చేపట్టి అఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలో కిందిస్థాయి అధికారులు విపరీతమైన అవినీతిలకు పాల్పడుతున్నారని అలాంటి అధికారులు అధికార హోదాలను అడ్డం పెట్టుకొని వీసీ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ విపరీతంగా తిరుగుతూ ఆయా అధికారుల అవినీతికి అడ్డుపడుతున్న వ్యక్తులపై కారణాలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మానసికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తుచేశారు. సందర్భానుసారంగా అధికారుల అవినీతిని బయటపెడుతున్న ఉద్యోగులను విపరీతంగా వేధిస్తున్నారన కిందిస్తాయి ఉద్యోగులపై అవినీతి అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడే ముందు అవినీతి చేయకుండా ప్రభుత్వ జీతంతో పనిచేస్తే విద్యార్థులకు విశ్వవిద్యాలయాలకు ఎంతో మేలు చేసిన వారు అవుతారు కదా అంటూ సూచించారు. ప్రతి విశ్వవిద్యాలయంలో హాస్టల్స్ లో కొనసాగుతున్న అవినీతి కోట్ల రూపాయలు దుర్వినియోగ రూపంలో మాయం అవుతుందన్నారు. ప్రతి డైరెక్టర్ ఇద్దరు ముగ్గురు నకిలీ వెధవలను చేతిలో పెట్టుకొని అవినీతి కుబేరులుగా చలామణి అవుతున్నారన్నారు. లేక్కా పత్రాలు లేకుండా ఆధారాలు లేకుండా ఎంచక్కా అవినీతికి పాల్పడుతున్న అధికారులను చూస్తుంటే విశ్వవిద్యాలయాల సొమ్ముతో విపరీతమైన ఆస్తులను సంపాదించుకోవాలన్న దుర్బుద్ధి కొట్టొచ్చినట్టుగా కనిపిస్తుందన్నారు. పెన్షన్స్ విధానానికి అర్హత లేని అధికారులంతా విశ్వవిద్యాలయాల సొమ్మును నిలువు దోపిడిగా దండుకోవడమే పెన్షన్ విధానంగా భావిస్తున్నారని ప్రతి విశ్వవిద్యాలయంలో హాస్టల్స్ లో జరుగుతున్న అవినీతి తేట తెల్లగా బయటపడుతుందన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయానికి 1000 కోట్లు కేటాయించిన ప్రభుత్వం అభివృద్ధిలో మాత్రం వెనుకబాటుతనాన్ని గుర్తించలేక పోతుందన్నారు. ప్రస్తుతం రాజకీయ చరిత్రలో రారాజులుగా వెలుగుతున్న ప్రతి నాయకుడు పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో విద్యాభ్యాసాన్ని కొనసాగించిన వారేనన్నా సంగతిని



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- మిగతా 2లో..

## పదేళ్లు నేనే సీఎం.. నాకు పోటీ లేదు

### ఢిల్లీలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

వచ్చే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న రేవంత్ రెడ్డి

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చివరి దశకు చేరిందని వెల్లడి

కిషన్ రెడ్డి కోరితే సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటన

కేసీఆర్‌ను జైల్లో పెట్టాల్సిన అవసరం లేదన్న సీఎం

జూబ్లీహిల్స్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన

6



## క్షేత్రస్థాయి భద్రత మధ్య ఓటింగ్

ఓట్ల లెక్కింపుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

సంయమనం పాటించకపోతే పోలీస్ అధికారులు చర్యలు చేపడతారు

పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాం

నిఘ కేంద్రాల మధ్య ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత: డిజిపి బి. శివధర్ రెడ్డి

2



## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

6

కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల

## రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి అర్హులందరికీ న్యాయం చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2





## సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తత

హోంగార్డులపై జగ్గారెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ హోంగార్డ్ సంక్షేమ సంఘం తీవ్ర ఆగ్రహం

6

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# క్షేత్రస్థాయి భద్రత మధ్య ఓటింగ్

**ఓట్ల లెక్కింపుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**
**సంయమనం పాటించకపోతే పోలీస్ అధికారులు చర్యలు చేపడతారు**
**పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాం**
**నిఘ కేంద్రాల మధ్య ఓట్ల లెక్కింపు**
**కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత: డిజిపి బి. శివధర్ రెడ్డి**

హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-

రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి జరుగుతున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 కౌంటింగ్ స్టేషన్లను సిద్ధం చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతను ఏర్పాటు చేసినట్లు డిజిపి పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 12 వేల మంది పోలీసు బలగాలతో పాటు సాయుధ బలగాలు , క్విక్ రెస్పాన్స్ టీమ్స్ నిరంతరం పహారా కాస్తాయని, అదనపు భద్రత కోసం ప్రతి కౌంటింగ్ కేంద్రాన్ని సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉంచామని, వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులను తన కార్యాలయ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షిస్తామని వివరించారు. లెక్కింపు కేంద్రాలకు వచ్చే మార్గాలను కఠినంగా నియంత్రిస్తున్నామని, పాస్‌లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఏదైనా అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో సంబంధిత చట్టాల ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు డిజిపి తెలిపారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తామని, జన సమూహాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, పోలీసు అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ కౌంటింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.బిఎన్ఎస్ఎస్ 163 ప్రకారంగా.... కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎక్కువ మంది గుమికూడటం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలపై నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని డిజిపి పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతంగా ముగిసేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రజలు పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని డిజిపి బి. శివధర్ రెడ్డి సూచించారు.

# బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి: కవిత

**తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్న కవిత**
**బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్**
**త్వరలోనే కొత్త రాజకీయా పార్టీ పెడతామని వెల్లడి**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్




కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్ బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు... ఓటర్లకు బంగారు నాణెమంటూ నకిలీ నాణేలు ఇచ్చిన అభ్యర్థి

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విస్తుపోయే ఘటన**
**రాగి నాణేనికి పసిడి పూత పూసిన నాణేలు పంచిన అభ్యర్థి**
**నకిలీ నాణేలు ఇవ్వడంపై ఓటర్ల ఆగ్రహం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విస్తుపోయే ఘటన చోటు చేసుకుంది. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో నిన్న పోలింగ్ ముగిసింది. చెదురు ముదురు ఘటనలు మినహా రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఎన్నికల సమయంలో చాలామంది అభ్యర్థులు అనధికారికంగా ఓటర్లకు నగదు, ఇతర బహుమతులు పంచుతుంటారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో ఒక అభ్యర్థి ఇచ్చిన కానుక చర్చనీయాంశంగా మారింది. తమకు గోల్డ్ కాయిన్ అని చెప్పి నకిలీ కానుక ఇచ్చారంటూ సిరిసిల్లలో ఓ వార్డులో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు అభ్యర్థి ఓట్లు వేయించుకోవడానికి రాగి నాణేలకు పసిడి పూత పూసి వాటిని బంగారు నాణేలుగా ఇచ్చారని పలువురు వాపోయారు. ఓటర్ల ఆగ్రహం నేపథ్యంలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై అధికారులు విచారణ చేపట్టారు.




# విశ్వవిద్యాలయాల అభివృద్ధి ఉత్తమాటేనా

మొదటి పేజీ తరువాయి

మర్చిపోకూడదన్నారు.విద్యార్థుల అభివృద్ధికి గానీ విద్యా వ్యవస్థ బలోపేతానికి గాని హాస్టల్స్ సమగ్ర అభివృద్ధికి గాని తోడ్పాటును అందించాలనే ఆలోచన హాస్టల్స్ డైరెక్టర్లలో ఏ ఒక్కనికి లేదన్నారు.డబ్బుల రూపంలో కొంతమంది బంగారం రూపంలో మరికొంతమంది వస్తువుల రూపంలో ఇంకొంతమంది,బినామీ ఆస్థిదారులుగా చలామణి చేస్తున్న డైరెక్టర్లు వాహనాల రూపంలో అసలు సిసలైన హాస్టల్స్ డైరెక్టర్లుగా సాంకేతికపరమైన అవినీతిని కొనసాగిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను బేకతారు చేస్తున్నరన్నారు.ఇతరులకు హాస్టల్స్ లో అనుమతులు లేవంటూ కఠినమైన ఆంక్షలను విధిస్తున్న హాస్టల్స్ అధికారులు చివరకు విద్యార్థుల తల్లిదండ్రులను కూడా హాస్టల్స్ లోనికి అనుమతి ఇవ్వకపోవడం వికారంగా ఉందన్నారు.ఓయూలో జరిగిన సంఘటన విద్యార్థులను ఎంతో బాధపెట్టిందన్నారు.ఓయూలో రోడ్డెక్కిన విద్యార్థులు ఓయూ హాస్టల్‌లో విద్యార్థినిని చూసేందుకు వచ్చిన తల్ల రాత్రి అవ్వడంతో తన తల్లి హస్టల్‌లో ఉండి ఉదయం వెళ్తుందన్న విద్యార్థిని అందుకు అనుమతి నిరాకరించిన హాస్టల్ అధికారుల సాయంత్రం నుంచి తమ తల్లిని బయటే నిలబెట్టి అవమానించారని ఆరోపించిన విద్యార్థిని అధికారుల తీరును తప్పుబడుతూ ఆర్ట్స్ కాలేజీ ప్రధానరహదారిపై బైఠాయించిన విద్యార్థినిలువాళ్ల బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలవక నువ్వు లోపల బాధపడుతున్నారన్నారు. ఇలా వేధించడం వల్ల అధికారులు కఠిన తరాన్ని ప్రదర్శిస్తూ హాస్టల్స్ హక్కులను కాపాడుతున్నామనుకొని గర్వపడుతున్నారే తప్ప వాళ్లే విపరీతమైన అవినీతిని చేస్తున్నారని విద్యార్థుల దృష్టిలో బేవర్స్ అధికారులుగా కొనసాగుతూనే ఉన్నతాధికారులను తమ వైపు మలుచుకొని ఇలాంటి అవమానకరమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు.90 శాతం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న విద్యార్థులందరూ బడుగు బలహీన వర్గాలేనని అలాంటి బహుజన వర్గాల విద్యార్థులను వేధింపులకు గురి చేస్తుండడమే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులను అవమానపరిచే స్థాయికి విశ్వవిద్యాలయాలు చేరిపోతూ... ఉన్నత అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ చిన్న ఉద్యోగులపై చర్యలు చేపడుతున్న డైరెక్టర్లు చిల్లర వెధవల కన్నా హీనంగా ప్రవర్తిస్తున్నారని అలాంటి అవినీతి అధికారుల వల్ల విశ్వవిద్యాలయాల పరువుతోపాటు ఉన్నతాధికారుల నిజాయితీ దేనికి పనికి రాకుండా పోతుందన్నారు.దొంగ బిల్లులను జిఎస్టి బిల్లులను అవినీతి బిల్లులను గుర్తించలేని దుస్థితిలో అధికార యంత్రాంగాలు పనిచేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు.పేద విద్యార్థుల డబ్బులు తినాలనే ఆలోచన గలిగిన ప్రతి చిల్లర వెధవ గంభీరంగా ప్రవర్తిస్తూ చాలా చోట్ల డబ్బులు పెట్టుకొని నిజాయితీపరులమంటూ ప్రచారం చేయించుకుంటున్నారని దానంత హీనమైన బతుకు మరొకటి లేదన్నారు.కొన్ని విశ్వవిద్యాలయాల్లోనైతే అవినీతి కమిటీలు ఎదుర్కొంటూ కమిటీలకు లెక్కలు చెప్పకుండా దొంగ దారిన దొడ్డి దారిన పైరవీలు చేసుకుంటూ తప్పించుకు తిరిగే అధికారులే డైరెక్టర్లుగా కొనసాగుతూ విశ్వవిద్యాలయ సొమ్మును ఎంత పవిత్రంగా అవినీతిమయం చేయొచ్చో అడక్కుండానే చూపిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయ పరువును విద్యార్థుల సొమ్మును కాపాడాల్సిన ఉన్నతాధికారులు తక్షణకర్తవ్యంలో భాగంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోనైనా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతను చేపట్టాల్సింది పోగా అవినీతి అధికారుల మాటలు వింటూ వాళ్ళు కొనసాగిస్తున్న అక్రమాలనన్నిటిని కళ్లారా చూస్తూనే ఏం చేయలేని పరిస్థితిలో విశ్వవిద్యాలయాల పాలన నడుస్తుందన్నారు.ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ షెడ్యూల్ కులానికి చెందిన నిజాయితీ కలిగిన ఆచార్యుడని,కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాల ప్రిన్సిపల్ షెడ్యూల్ కులానికి చెందిన మరో నీతిపరుడైన ఆచార్యులైనప్పటికిని అధికారంలో వాళ్లు చూపుతున్న నిజాయితీని హాస్టల్స్ డైరెక్టర్స్ చూపెట్టకపోవడం పైగా విపరీతమైన అవినీతిని చూస్తూ కూడా పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లకపోవడం ఒకింత బాధాకరమన్నారు. వీసీ రిజిస్ట్రార్లు అవినీతి డైరెక్టర్ల మోజులో పడి చూసి చూడనట్టు పరిపాలిస్తున్నారని దానివల్ల హాస్టల్స్ డైరెక్టర్ల ఆగడాలకు హద్దులు లేకుండా పోతున్నాయన్నారు.అవినీతి అంటేనే హాస్టల్స్.... హాస్టల్స్ అంటేనే...అవినీతి అనే స్థాయికి విద్యార్థుల సొమ్మును దోచుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ఒకవైపు హాస్టల్స్ సొమ్మును దోచుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావలసిన ప్రభుత్వ ఫీజులను నేరుగా విద్యార్థుల అకౌంట్స్ లలోనికి నేరుగా డబ్బులు వేస్తున్నప్పటికీ లెక్కలేనన్ని తప్పుడు బిల్లులతో విద్యార్థుల మెస్ ఛార్జీలను అమాంతం పెంచేస్తూ పేద విద్యార్థుల సొమ్మును దౌర్జన్యంగా లాగేసుకుంటున్నారన్నారు.విద్యా విషయంలో అన్యాయాన్ని అనుభవిస్తున్న పేద విద్యార్థులు, మెస్ విషయంలో నాసిరకం భోజనాలను తింటూ విపరీతమైన అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.ప్రశ్నిస్తున్న విద్యార్థులపై కుల సంఘాలతో దాడులు చేయిస్తూ విశ్వవిద్యాలయాలలో లేకుండా చేయడమే అవినీతి అధికారుల టార్గెట్గా మారిపోతుందన్నారు.కులం అడ్డం పెట్టుకొని దోచుకోవడం కూడా విశ్వవిద్యాలయ చట్టంలో భాగంగా మారిపోయినట్లుగా కనిపిస్తుందన్నారు.అగ్రవర్ణాలు అందినంత దోచుకుంటూ బహుజన అధికారులు భరించరాని అవినీతికి పాల్పడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన అధికారులు చేతి ముడుపులు లేనిది పనిచేయలేని స్థితికి విద్యా వ్యవస్థలను నెట్టివేస్తున్నారని హెచ్చరించారు.ఒకప్పుడు విశ్వవిద్యాలయాలంటే కేవలం విద్యా ప్రమాణాలకు మాత్రమే ప్రాధాన్యతను ఇచ్చేవారని ప్రస్తుతం విశ్వవిద్యాలయాలలో ప్రభుత్వ విద్యను సైతం ప్రైవేటు వ్యాపారానికి వాడుకుంటున్న అధికారులు లేకపోలేదన్నారు కేవలం హాస్టల్స్ లోనే ఈ రకమైన దోపిడీ జరుగుతుంటే ప్రైవేట్ కళాశాల అనుమతులలో ఇంకెంత దోపిడీ జరగాలో విశ్వవిద్యాలయాల మేధావులు పసిగట్టాలన్నారు.కమిటీలలోని అధికారులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ అవినీతి మరకలను కప్పిపుచ్చుకుంటాం అనుకుంటే పుట్టగతులు లేకుండా పోగలరు జాగ్రత్త అంటూ హాస్టల్స్ డైరెక్టర్లను పేద విద్యార్థులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారన్నారు.ప్రస్తుతం విశ్వవిద్యాలయాల పరిస్థితి దయనీయమైనస్థితిలో ఉంటుండగా విద్యాపరమైన అభివృద్ధి అకాడమిక్స్ పరమైన అభివృద్ధి పరిశోధన పరమైన అభివృద్ధి విశ్వవిద్యాలయాల ఆస్తుల రక్షణ అభివృద్ధి విశ్వవిద్యాలయాల భూముల రక్షణ అభివృద్ధి అన్నిటికి మించి విశ్వవిద్యాలయాల నిధుల రక్షణ అభివృద్ధి ఎంతో మెరుగుపడాలని సూచించారు.అవినీతిని పెంచి పోషిస్తున్న అధికారులను అన్ని విశ్వవిద్యాలయాలలోని వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్,ఎక్కడికి అక్కడే తొక్కేయలన్నారు.అధికారుల తీరును బట్టి విలువలు ఉంటాయి గాని ప్రతి విశ్వవిద్యాలయంలో అవినీతిపరులే అధికార హోదాలో విలువలు కలిగిన వాళ్ళమంటూ చలాయిస్తుండడం విశ్వవిద్యాలయాల సొమ్మును పూర్తిగా మింగేసే వరకు నిద్రపోయేలా లేరని హాస్టల్స్ పాలనలను గమనిస్తుంటే అవినీతిమయమంతా గంటలు మోగించే శబ్దాలతో మొత్తుకుంటున్నాయన్నారు. ఉన్నత అధికారులారా అవినీతి అధికారులైన హాస్టల్స్ డైరెక్టర్ల భరతం పట్టండంటూ గుర్తుచేశారు.

# పాతబస్తీలో రెచ్చిపోయిన రౌడీ గ్యాంగ్.. యువకుడిపై కత్తితో దాడి

**కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ మూక హల్‌చల్**
**కిరాణా దుకాణం వద్ద యువకుడిపై కత్తితో దాడి**
**కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ పాతబస్తీలోని కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ మూక హల్‌చల్ చేసింది. నిన్న రాత్రి ఒక ముఠా కిరణా దుకాణం వద్ద యువకుడిపై కత్తితో దాడికి పాల్పడటం కలకలం రేపింది. ఫాతిమా ఆసుపత్రి ప్రాంతంలో రౌడీ షీటర్ అసద్ తన ముఠాతో కలిసి ఖయ్యుం అనే యువకుడిపై దాడి చేశాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఖయ్యుం తన సోదరుడి కిరాణా దుకాణంలో సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న అసద్ ముఠా దాడికి పాల్పడింది. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసద్‌పై ఒక హత్య కేసు, రెండు హత్యాయత్నం కేసులు, దోపిడీ, దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. 2015-2016 మధ్య అసద్‌పై పీడీయాక్ట్ పెట్టారు. అసద్, అతని ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు.



# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి అర్హులందరికీ న్యాయం చేస్తాం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైద్రాబాద్, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)



తెలంగాణ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసిందని, అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలతో జి.ఓ. 103 జారీ చేసినట్లు మంత్రి వివరించారు. ఈ సవరణలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకుపైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. సర్క్యులేషన్ ఆధారంగా పత్రికలకు అక్రిడిటేషన్ కార్డుల కేటాయింపును కూడా మంత్రి వివరించారు. 2.50 లక్షలకు పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుంచి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు, 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390 కార్డులు, 15,001 నుంచి 25,000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 కార్డులు, 15 వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226 కార్డులు, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానళ్లకు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200, డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.

# కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు

పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, ఫిబ్రవరి 12 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ తెలిపారు. నిన్న నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల అనంతరం రేపు జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లో కౌంటింగ్ నిర్వహించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బి.ఎన్.ఎస్.ఎస్ / సి.ఆర్.పి.సి సెక్షన్ 163 ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధాజ్ఞలు ఈ రోజు ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఫిబ్రవరి 14 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడకుండా రాజకీయ పార్టీ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద తగిన సంఖ్యలో పోలీస్ బలగాలను మోహరించడంతో పాటు, సీసీ కెమెరాలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు మరియు సంబంధిత సిబ్బందికే కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుని, కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక విధులు నిర్వహించనున్నారు. అవసరమైతే అదనపు బలగాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి గుంపులుగా చేరడం, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించడం జరిగితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పోలీస్ శాఖకు సహకరించి కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని అధికారులు కోరారు.




## రైల్వే స్టేషన్లలో చిన్నారుల అపహరణ కేసు

ముగ్గురు చిన్నారుల గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి

గుర్తిస్తే వెంటనే సమాచారమివ్వాలని కాజీపేట పోలీసులు పిలుపు



**కాజీపేట, ఫిబ్రవరి 12 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

రైల్వే స్టేషన్ పరిసరాల్లో చిన్నారులను అపహరించి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను గత నెలలో టాస్క్‌ఫోర్స్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో కీలకమైన వివరాలు వెలుగులోకి రావడంతో పాటు, నిందితుల వద్ద నుండి పలువురు చిన్నారులను పోలీసులు సురక్షితంగా రక్షించారు. రక్షించబడిన చిన్నారుల్లో కొందరిని ఇప్పటికే వారి తల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు. అయితే, మరో ముగ్గురు చిన్నారులు ఇంకా తమ కుటుంబాలకు దూరంగా ఉండగా, ప్రస్తుతం వారు శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్నారు. ఈ చిన్నారుల అసలు కుటుంబాలను గుర్తించేందుకు పోలీసులు ప్రజల సహకారం కోరుతున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఇచ్చిన సమాచార ప్రకారం, ఫోటోలో ఉన్న చిన్నారుల్లో ఒకరు సుమారు 6 సంవత్సరాల వయస్సు గల బాలుడు. ఈ బాలుడిని 2023 అక్టోబర్ నెలలో కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నుండి అపహరించినట్లు వెల్లడైంది. అదేవిధంగా, మరో 7 నెలల పాపను 2025 అక్టోబర్ నెలలో మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతం నుండి, మరో 5 నెలల పాపను రామగుండం రైల్వే స్టేషన్ ప్రాంతం నుండి అపహరించినట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలు రైల్వే స్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిన్నారుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. చిన్నారులను అపహరించి విక్రయాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఫోటోలో ఉన్న ఈ ముగ్గురు చిన్నారులను ఎవరైనా గుర్తిస్తే వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తగిన ఆధారాలు మరియు రుజువులు సమర్పించిన రక్తసంబంధీకులకు చిన్నారులను అప్పగించే ప్రక్రియ చేపడతామని కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. సమాచారం అందించవలసిన ఫోన్ నంబర్ – కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి -- 871268122. పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు వంటి రద్దీ ప్రదేశాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా చిన్నారుల కదలికలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## అల్లరి చేశాడని బాలుడిపై దాడి

కన్నుకు తీవ్ర గాయం, అంగన్వాడీ టీచర్‌పై కేసు

**రాజన్న సిరిసిల్ల జిల్లా, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చోటుచేసుకున్న ఘటన కలకలం రేపింది. అల్లరి చేస్తున్నాడనే కారణంతో అంగన్వాడీ టీచర్ బాలుడిపై దాడి చేయడంతో అతనికి కన్ను, చేతులకు తీవ్ర గాయాలు అయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన కొంపెల్లి లక్ష్మీ, విజయ్ కుమార్ దంపతులు తమ కుమారుడు విద్వాన్స్‌ను ప్రతిరోజులాగే అంగన్వాడీ కేంద్రంలో వదిలేసి పనుల నిమిత్తం వెళ్లారు. అనంతరం బాలుడికి జ్వరం వచ్చిందని, వెంటనే ఇంటికి తీసుకెళ్లాలని అంగన్వాడీ టీచర్ రాణి బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో వెంటనే అంగన్వాడీ కేంద్రానికి చేరుకున్న తల్లిదండ్రులు బాలుడి కంటికి, చేతులకు తీవ్ర గాయాలు ఉండటం గమనించి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి విజయ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, అంగన్వాడీ టీచర్ రాణిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అంగన్వాడీ సిబ్బంది, స్థానికులను పోలీసులు విచారిస్తున్నారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చిన్నారుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని అధికారులను కోరుతున్నారు. అధికారులు కూడా ఘటనపై దర్యాప్తు చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఖమ్మం జిల్లా, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను రైల్వే పోలీస్ జీఆర్‌పీ ఎస్ఐ జె. సురేష్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం పరిధిలోని డోర్నకల్ నుండి పాపటపల్లి మధ్య రైల్వే మార్గంలో కిలోమీటర్ 469/12 వద్ద గురువారం ఉదయం కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 55 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతుడు పింక్ కలర్ షర్టు, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా కుటుంబ సభ్యులు 8712658600 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ

మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు.

## మానవత్వం మరిచిన గ్రామం

భార్య, అక్కలే పాడె మోసిన హృదయ విదారక ఘటన

**జగిత్యాల, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కందనకుంట గ్రామంలో జరిగిన ఒక ఘటన మానవత్వాన్ని ప్రశ్నించేలా నిలిచింది. కుల బహిష్కరణకు గురైన ఎదుల రాజేశం మరణించిన తర్వాత, ఆయన అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు ఎవరూ ముందుకు రాకపోవడం కుటుంబాన్ని తీవ్ర వేదనలో ముంచేసింది. జీవితాంతం కష్టపడి కుటుంబాన్ని పోషించిన రాజేశం మృతదేహాన్ని చివరి యాత్రకు తీసుకెళ్లే సమయానికి, గ్రామంలో సహాయం కోసం చూసిన ఆయన కుటుంబ సభ్యులకు ఎక్కడా తోడు లభించలేదు. గ్రామ సర్పంచ్ మరియు కొంతమంది కుల పెద్దలు పాడె మోయకూడదని గ్రామస్తులకు ఆజ్ఞాపించినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు ఎంత వేడుకున్నా, కాళ్లు మొక్కుతామని ప్రాధేయపడ్డా, ఎవరి మనసూ కరగలేదని బాధితులు చెబుతున్నారు. చివరకు పరిస్థితి ఇంత దారుణంగా మారింది కాబట్టి, రాజేశం భార్య, అక్కలు మరియు సొంత కుటుంబ సభ్యులే కన్నీళ్లు మున్నీళ్లుగా పాడె మోసి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. జీవితంలో ఎన్నో కష్టాలు చూసిన ఆ కుటుంబానికి, చివరి సంస్కారాల సమయంలో ఎదురైన ఈ అనుభవం మరింత మానసిక వేదనను మిగిల్చింది. గ్రామంలో ఇలాంటి కుల బహిష్కరణ ఇప్పటికీ కొనసాగుతుండటం పట్ల స్థానికులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి చివరి గౌరవం ఇవ్వడం కూడా మానవత్వపు కనీస బాధ్యత అని, అలాంటి సమయంలో సహాయం చేయకుండా అడ్డుకోవడం అమానవీయమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన ఒక కుటుంబం ఎదుర్కొన్న దుఃఖాన్ని మాత్రమే కాకుండా, సమాజంలో ఇంకా మిగిలి ఉన్న కుల వివక్ష ఎంత లోతుగా ఉందో చూపిస్తోంది. మానవత్వం కంటే కులం పెద్దదిగా మారినప్పుడు, బాధితులు అనుభవించాల్సిన వేదన ఎంత భయంకరంగా ఉంటుందో కందనకుంట ఘటన మరోసారి గుర్తు చేసింది.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ

ఎలక్షన్ కమిషన్ గుర్తింపు కార్డులు ఉన్న వారికే లెక్కింపు కేంద్రంలో ప్రవేశం

ఎస్పీ డా. శబరీష్,ఐ.పి.ఎస్


**మహబూబాబాద్. జై భీమ్ క్రైమ్ న్యూస్**




మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, తొర్రూర్, మరిపెడ కేంద్రాలలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెక్షన్ రేపు ఉదయం 6 గంటల నుండి శనివారం ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ధర్నాలు,రాస్తారోకోలు,ఊరేగింపులు,సభలు, సమావేశాలు,టపాకాయలు కాల్చడం,విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధించబడినవని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అభ్యర్థులు, వారి ఏజెంట్లు నిషేధిత వస్తువులు అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిల్స్, పేలుడు పదార్థాలు లేదా భద్రతకు హానికరమైన ఎలాంటి వస్తువులు లెక్కింపు కేంద్రంలోకి తీసుకురాకూడదని తెలిపారు. తనిఖీలు నిర్వహించే సిబ్బందికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులు ఉన్న వారికే లెక్కింపు కేంద్రంలో ప్రవేశం కల్పించబడుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలు, అభ్యర్థులు మరియు రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని గౌరవించి శాంతి భద్రతలకు సహకరించాలని జిల్లా పోలీసు శాఖ తరపున ఎస్పీ విజ్ఞప్తి చేయడం జరిగింది.

## మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ లెక్కింపు

రూ.13.51 కోట్లకు పైగా ఆదాయం



**హన్మకొండ, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. హనుమకొండలోని టిటిడి కల్యాణ మండపంలో ఎండోమెంట్స్ శాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సేవా సమితి సభ్యుల సమక్షంలో హుండీల లెక్కింపు కార్యక్రమం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య శాంతియుతంగా నిర్వహిస్తున్నట్లు జాతర కార్యనిర్వాహక అధికారి తెలిపారు. అధికారుల వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటివరకు మొత్తం 828 హుండీలు లెక్కించగా, భక్తుల నుంచి రూ.13,51,76,275 నగదు ఆదాయం లభించింది. లెక్కించిన హుండీలలో ఇనుప హుండీలు 780, వస్త్ర హుండీలు 45, బియ్యం హుండీలు 3 ఉన్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు భక్తులు సమర్పించిన విలువైన లోహాలు కూడా లభించాయి. ఇందులో సుమారు 486 గ్రాములు 500 మిల్లీగ్రాముల బంగారం, అలాగే సుమారు 31 కిలోలు 700 గ్రాముల వెండి లభించినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం లెక్కించిన నగదు రూ.25,93,006 ను నియమ నిబంధనల ప్రకారం బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా కొనసాగిందని, లెక్కింపు పూర్తయిన హుండీల వివరాలను రోజువారీ నివేదిక రూపంలో సంబంధిత ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు కార్యనిర్వాహక అధికారి తెలిపారు. జాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులు భారీగా తరలివచ్చి సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడంతో హుండీలలో గణనీయమైన ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రత, లెక్కింపు, రవాణా తదితర అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే విధంగా దశలవారీగా లెక్కింపును కొనసాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# కార్మిక హక్కులను హరిస్తున్న బీజేపీ విధానాలు

**విద్యుత్ బిల్లు వెనక్కి తీసుకోవాలి**
**సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ డిమాండ్**

**హసన్‌పర్తి, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

దేశ వ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సీఐటీయూ మండల కన్వీనర్ పుల్ల అశోక్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే సీడ్ బిల్లు (విత్తన బిల్లు) ముసాయిదాను, విద్యుత్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, జీఆర్ఎఎంజి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదించినప్పటి నుండి దేశవ్యాప్తంగా కార్మికులు ఐదు భారీ సార్వత్రిక సమ్మెలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రజా సేవలను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నారని విమర్శించారు. విద్య, ఆరోగ్య రంగాల్లో వ్యాపారీకరణ పెరగడంతో సామాన్య ప్రజలు ఆర్థిక భారాన్ని భరించలేకపోతున్నారని, కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుతున్నాయని అన్నారు. దేశ సహజ వనరులను కొద్ది మంది పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టే విధానాలను కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ జిల్లా కమిటీ సభ్యురాలు వేలు రజిత, మంద సుచందర్, సీఐటీయూ మండల కమిటీ సభ్యులు ఉడుత శ్రీవాణి, మాలోతు లలిత, బొమ్మగాని వనజ, ఆనందం, ప్రమీల, రాజేశ్వరి, పుష్ప, వెంకట్ లక్ష్మి, పూల, రాణి, పద్మవతి, చందన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**ఆధ్యాత్మిక శోభతో రామప్ప ఆలయాన్ని సుందరీకరించాలి**
**భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి**
**మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



**ములుగు, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని సుందరీకరించాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆలయ ప్రాంగణం లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి,ఆర్డీఓ వెంకటేష్ ఆలయ ఈవో ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

**జగ్గారెడ్డి, ధర్మపురి అరవింద్‌ల అరెస్టుకు డిమాండ్**



**హైద్రాబాద్, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ నాయకులు పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయాన్ని సందర్శించి పలు అంశాలపై ఫిర్యాదు సమర్పించారు. మిర్యాలగూడలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఎన్నికల ఫలితాల దృష్ట్యా బీఆర్ఎస్ కౌన్సిలర్, కార్పొరేటర్ అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. అభ్యర్థులను అపహరించే అవకాశాలు ఉన్నాయని కూడా ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పోలీసులపై దుర్భాషలాడిన ఘటనపై చర్యలు తీసుకోవాలని, అలాగే బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలపై విచారణ జరపాలని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల ప్రతిష్ట, ఆత్మగౌరవం దెబ్బతింటోందని, ప్రభుత్వ వైఖరి దీనికి కారణమని ఆయన విమర్శించారు. హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. అలాగే సోషల్ మీడియా వేదికల ద్వారా బీఆర్ఎస్ పార్టీపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ, సంబంధిత ఆధారాలను డీజీపీకి అందజేశామని తెలిపారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పోలీసు వ్యవస్థ గౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## సీఎంఆర్ రైసును మిల్లర్లు సకాలంలో ఇవ్వాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హన్మకొండ, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ను రైస్ మిల్లర్లు సకాలంలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కు అందజేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, టాస్క్ ఫోర్స్ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎంఆర్ బకాయిలు, పెండింగ్ సరఫరాలు, పెనాల్టీల చెల్లింపులపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రభుత్వానికి బకాయి ఉన్న సీఎంఆర్ రైస్‌ను త్వరితగతిన ఎఫ్‌సీఐకి అందజేయాలని, డిఫాల్ట్‌గా ఉన్న మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ విధించిన పెనాల్టీలను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సరఫరా ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో టాస్క్ ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, విజిలెన్స్ సీఐ వసంత్ నాయక్, సివిల్ సప్లై డీటీలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## పాలకుర్తి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సీపీకి ఆహ్వానం



**వరంగల్, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర స్వామి -- శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించబడే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ ప్రధాన అర్చకులు వరంగల్ పోలీస్ కమిషనర్‌ను ఆహ్వానించారు. గురువారం సీపీ క్యాంపు కార్యాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి వెంకట రాజేశ్వర శర్మ, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలను కూడా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాముఖ్యత, మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు, రథోత్సవం వంటి కార్యక్రమాల వివరాలను ప్రధాన అర్చకుడు సీపీకి వివరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లపై కూడా చర్చ జరిగింది. పాలకుర్తి దేవస్థానం ప్రాంతీయంగా ప్రముఖ క్షేత్రంగా పేరుగాంచినదిగా, ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఈసారి కూడా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్/వర్ధన్నపేట, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రెండవ ఆర్డినరీ మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. కౌంటింగ్ హాల్స్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది నియామకం, భద్రతా ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థ, అభ్యర్థుల ప్రతినిధుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మొత్తం మూడు రౌండ్లలో నాలుగు టేబుళ్ల ద్వారా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా కొనసాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో డిఆర్డిఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీఓ సుమ, వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## కన్నెర్ర చేసిన కార్మిక లోకం

**కేంద్ర విధానాలపై సామెల్ కార్తీక్ ధ్వజం**



**శేరిలింగంపల్లి, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, కార్మిక విధానాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సామెల్ కార్తీక్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన కీలక చట్టప్రతిపాదనలు దేశాన్ని ఆర్థిక సంక్షోభ దిశగా నెడుతున్నాయని ఆయన ఆరోపించారు. అగ్రరాజ్యం అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు దేశీయ పరిశ్రమలకు, చిన్న మధ్య తరహా వ్యాపారాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో రైతు వ్యతిరేక నిర్ణయాలతో ప్రజల ఆగ్రహానికి గురైన భారతీయ జనతా పార్టీ ఇప్పుడు కార్మికులను బలహీనపరిచే విధానాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. పుష్కరకాలంగా కొనసాగుతున్న కేంద్ర పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఆరోపించారు. మాజీ ప్రధాన మంత్రులు పి.వి. నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో దేశాన్ని రక్షించి, బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాది వేశాయని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి, ఎనిమిది గంటల పనిదినానికి చట్టబద్ధత కల్పించి కార్మికుల హక్కులను పరిరక్షించామని పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతోందని, ఆ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలనే దిశగా రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), భారత జాతీయ కార్మిక సంఘం, వివిధ కార్మిక మరియు కర్షక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

## మాదాపూర్‌లోని ఖానామెట్‌లో హైడ్రా కూల్చివేతలు.. ఉద్రిక్తత

**రోడ్డు నెంబర్ 55లోని దుకాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు**
**నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు**
**ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టారని ఆందోళన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ధర్నా

**కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హన్మకొండ, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన సమ్మెకు మద్దతుగా, విశ్వవిద్యాలయాల ఉద్యోగ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడులు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉండి పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందించబడినవని విమర్శించారు. కార్మికులు ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ చట్టాలు హరించివేస్తున్నాయని అన్నారు. వెంటనే ఈ కొత్త చట్టాలను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ప్రజల డబ్బును కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలను విరమించుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెను పరిగణలోకి తీసుకొని కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని, ప్రభుత్వాలు ప్రజల సేవ కోసం ఉండాలని, ప్రజలను నష్టపరచడానికి కాదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, వాటిని రూపుమాపడానికి పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. అనేక సంవత్సరాలుగా సాధించుకున్న హక్కులను తొలగించే ప్రయత్నాలు చేస్తే కార్మికులు మౌనంగా ఉండరని హెచ్చరించారు. అఖిల భారత స్థాయిలో విశ్వవిద్యాలయాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన జరుగుతోందని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి అధ్యక్షత వహించారు.




కార్యక్రమంలో క్లాస్ ఫోర్త్ యూనియన్ అధ్యక్షుడు గుమ్మయ్య, జనరల్ సెక్రటరీ బొక్కమొగిలి, టెక్నికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాము, గౌరవాధ్యక్షుడు నందయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాల చిరంజీవి, సిఐటియు యూనియన్ అధ్యక్షుడు రామచందర్, జనరల్ సెక్రటరీ దేశిని రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రల్లీ శోభన్ కుమార్, కోశాధికారి దామెర రణధీర్, భూక్య కిషన్ నాయక్, పల్లం రాజు, సందీప్, మధు, కృష్ణ, శోభరాణి, సుజాత తదితర నాయకులు, ఉద్యోగులు పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.

# ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న నలుగురు మైనర్లతో సహా ఏడుగురు నిందితులు అరెస్ట్

**సంగెం. జై భీమ్ క్రైమ్ న్యూస్**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాటు హైదరాబాద్ నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సంగెం పోలీసులు గురువారం అరెస్టు చేసారు. పట్టుబడిన వారిలో నలుగురు మైనర్లును వున్నారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 15లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ, పట్టుబడిన ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు ఒకే ప్రాంతంలో నివాసం వుండటంతో, తరుచుగా కలుసుకునేవారు. దీనితో వీరి మధ్య స్నేహం కుదరటంతో నిందితులందరు వారికి వచ్చే అదాయంతో మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవారు. దీనితో వారి అదాయం వారి జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఈ ముఠా పార్కుచేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలని అనుకున్నారు. దీనితో నిందితులందరు ఓ ముఠా ఏర్పడి వరంగల్ కమిషనరేట్ పరిధిలో పాటు, హైదారబాద్ నగరంలో తాళం వేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హన్మకొండ పద్మాక్షమ్మ గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్ర పర్చేవారు. ఈ తరహాలో నిందితులు మొత్తం 15 చోరీలకు పాల్పడగా ఇందులో సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు చోరీలకు పాల్పడగా,సంగెం,హసన్‌పర్తి, మీల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చోప్పున ఆరు చోరీలకు పాల్పడగా ,హన్మకొండ ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున, హైదరాబాద్ మడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను నిందితులు చోరీ చేసారు. ఈ నెల ఒకటవ తారీకున సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశాలపల్లి గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని నిందితులు చోరీ చేయడంతో, ఈ చోరీపై వాహన యజమాని సంగెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అధికారుల అదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు, దర్యాప్తు చేపట్టగా పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితులను గుర్తించిన పోలీసులు, ఈ రోజు ఉదయం గవిచర్ల గ్రామ గుండు సమ్మయ్య ఆలయం వద్ద ఎస్.ఐ వంశీ కృష్ణ అధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చోరీ చేసిన రెండు వాహనాలపై ఆరుగురు నిందితులు ప్రయాణిస్తూండగా అనుమానంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని విచారించగా నిందితులు పాల్పడిన చోరీలను పోలీసుల ఎదుట అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పద్మాక్షి గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్రపర్చిన మిగితా ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకొని చోరికి గురైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కబరిచిన మామునూరు ఏసిపి వెంకటేష్ పర్వతగిరి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ రాజగోపాల్, సిసిఎస్ ఇన్స్‌స్పెక్టర్ రాఘవేందర్, సంగెం ఎస్.ఐ వంశీ కృష్ణ ఏఏఓ సల్మాన్ పాషా, సంగెం హెడ్ కానిస్టేబుల్ సంతోష్, బాబు, కానిస్టేబుళ్ళు శ్రవణ్, యాకూబ్ పాషా, నవీన్, కార్తీక్ లను డిసిపి అభినందించారు.



# ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం





**హన్మకొండ, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాలనా శాస్త్రం, మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు విస్తృత ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు, ప్రొఫెసర్ గంగిడి శ్రీనివాసరెడ్డి ప్రధాన ఉపన్యాసం అందించారు. ఆయన "సిద్ధాంత గ్రంథ రచనలో మెలుకువలు" అనే అంశంపై మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు సిద్ధాంత గ్రంథం రచించే సమయంలో పాటించాల్సిన విధానాలు, పరిశోధనలో నిష్పాక్షికత, మూలాధారాల వినియోగం, రచనా క్రమం వంటి అంశాలపై పలు సూచనలు మరియు సలహాలు ఇచ్చారు. మరో విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలు, వాటి ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై అనే అంశాన్ని వివరంగా వివరిస్తూ, సంస్కరణల తర్వాత దేశ ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులు, అభివృద్ధి అవకాశాలు, సవాళ్లపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు, విభాగాధిపతి డా. ఆకుతోట శ్రీనివాసులు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా. చీకటి శ్రీను, ప్రొఫెసర్ చొక్కయ్య, ప్రొఫెసర్ అంజయ్య, డా. ఉమాశంకర్, డా. మోహన్, డా. దేవేంద్ర చారి పాల్గొన్నారు. అలాగే పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉపన్యాసాలను ఆసక్తిగా విన్నారు. కార్యక్రమం చివర్లో ఉపన్యాసకులకు ధన్యవాదాలు తెలియజేసి కార్యక్రమాన్ని ముగించారు.



## పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల తీరుతెన్నులను పరిశీలించిన పరీక్షల నియంత్రణ అధికారులు



**హన్మకొండ, 12 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

పి.జి. మూడవ సెమిస్టర్ పరీక్షల నిర్వహణను కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. పి. శ్రీనివాస్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా కాంపస్‌లోని కామర్స్ కళాశాల, నగరంలోని మాస్టర్ జీ డిగ్రీ కాలేజీ, న్యూ సైన్స్ డిగ్రీ అండ్ పి.జి. కాలేజీలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, ప్రశ్నాపత్రాల పంపిణీ విధానం, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పర్యవేక్షణ చర్యలను అధికారులు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరుగుతున్నట్లు వారు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బందికి అవసరమైన సూచనలు కూడా అందజేశారు. పరీక్షా కేంద్రాల సందర్శన సమయంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహ చారి, అధ్యాపకులు డా. ప్రగతి, డా. ఫణీంద్ర తదితరులు పరీక్షల నియంత్రణ అధికారులతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి విశ్వవిద్యాలయం తగిన ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణను పారదర్శకంగా, క్రమశిక్షణతో కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు.

## వలస కూలీలకు అండగా నిలిచిన న్యాయ సేవాధికార సంస్థ



**వరంగల్, జై భీమ్ క్రైమ్ న్యూస్**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలానుసారంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి యం.సాయి కుమార్ బొల్లికుంటలోని ఇ.యస్.కె. మార్క్ ఇండస్ట్రీస్ ఇటుక బట్టీలో రెస్క్యూ నిర్వహించారు. పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రం నుండి వచ్చిన వలస కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్న విషయాన్ని మరియు కనీస అవసరాలు కల్పించకుండా ఉండటాన్ని న్యాయమూర్తి స్వయంగా గుర్తించి, వారికి విముక్తి కల్పించి, స్వంత రాష్ట్రమైనటువంటి ఒడిశా రాష్ట్రానికి పంపించేలా ఏర్పాట్లు చేయాలని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ ను ఆదేశించారు. ఎనిమిది మంది వలస కార్మికులు అతి దయనీయ స్థితిలో పని చేయడాన్ని గమనించారు. వారి పని వేళలు, వారికి అందుతున్న సౌకర్యాలు, వేతనాల గురించి ఆరా తీయగా.. వారు తీవ్రమైన శ్రమ దోపిడికి గురవుతున్నట్లు వెల్లడైంది. దీంతో తక్షణమే స్పందించిన న్యాయమూర్తి, సంబంధిత అధికారులను పిలిపించి కార్మికుల పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు రావలసిన బకాయిలు చెల్లించేలా ఆదేశించడమే కాకుండా, వారు గౌరవప్రదంగా తమ స్వంత రాష్ట్రానికి చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. న్యాయమూర్తి చొరవతో వెట్టి చాకిరి నుండి బయటపడిన కార్మికులు, తమను ఆదుకుని స్వస్థలాలకు పంపిస్తున్నందుకు న్యాయస్థానానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవ్యవస్థ పేదలకు, బాధితులకు అండగా ఉంటుందని ఈ ఘటన మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వినోద, మామునూరు సబ్ ఇన్స్పెక్టర్ టి.శ్రీకాంత్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కరుణాకర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, కార్మికులు, ఇటుక బట్టీ నిర్వాహకుడు శివకృష్ణన్, పారా లీగల్ వాలంటీర్ హనుకాంత్ పాల్గొన్నారు. అంతేకాకుండా ఇటుక బట్టి నిర్వాహకుడి లైసెన్స్ రద్దు చేయాలంటూ లేబర్ ఆఫీసర్ ను ఆదేశించారు.

## మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**భూపాలపల్లి. జై భీమ్ క్రైమ్ న్యూస్**



మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం వంటి చర్యలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బందోబస్తు, క్యూ.ఆర్.టి టీములు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించబడతారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత అధికారుల అనుమతి మరియు వారు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే నిర్వహించాలి. ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# గజ్జెల్లి వారి భూదందా ఆరోపణలు

**28 ఎకరాల భూమి అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని బాధితుల ఫిర్యాదు**

**హైద్రాబాద్, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాజకీయ అండదండలు, రికార్డుల తారుమారు, బెదిరింపులతో పేదల భూములు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు హన్మకొండ జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఐనవోలు మండలం నందనం గ్రామానికి చెందిన మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు పై పలువురు బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తూ గురువారం హన్మకొండ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరగకపోతే ఆందోళనలు చేపడతామని బాధితులు హెచ్చరించారు. బాధితుల కథనం ప్రకారం, వివిధ సర్వే నంబర్లలో ఉన్న మొత్తం సుమారు 28.04 ఎకరాల భూమి రికార్డులను మార్పులు చేసి తన పేరిట పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి భూములను తిరిగి అప్పగించాలని వారు కోరుతున్నారు. తన కుమార్తె మరణించిన తరువాత మనవడు బొద్దుల పృథ్వీరాజ్ విదేశాల్లో ఉండటాన్ని ఆసరాగా తీసుకుని, సర్వే నంబర్లు 91/1, 91/బి/1లోని 4.16 ఎకరాల భూమిని ఫోర్జరీ పత్రాల ఆధారంగా తన పేరిట పట్టా చేయించుకున్నారని బాధితులు ఆరోపించారు. రక్తసంబంధాన్ని పక్కన పెట్టి ఆస్తి కోసం ఈ చర్యలకు పాల్పడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నందనం గ్రామంలోని గౌడ సంఘం సభ్యులు సంక్షేమ కార్యక్రమాల కోసం కొనుగోలు చేసిన సర్వే నంబర్లు 93, 101లోని 7.28 ఎకరాల భూమి కూడా అక్రమంగా పట్టా చేయించుకున్నారని సంఘం సభ్యులు ఆరోపించారు. భూమిని తిరిగి ఇస్తానని నమ్మించి మోసం చేశారని, ఇప్పుడు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. ఇంకా దొనికని రవీందర్‌కు చెందిన 4.10 ఎకరాలు, దొనికని శ్రీదేవికి చెందిన ఒక ఎకరం, దొనికని రేణుకకు చెందిన 1.31 ఎకరాలు, ఈద ప్రసాద్‌కు చెందిన 4.23 ఎకరాల భూమి కూడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక ప్రభుత్వానికి చెందిన ఆకేరు నది పరివాహక ప్రాంతంలోని సుమారు 8 ఎకరాల భూమి కూడా కబ్జాకు గురైందని వారు ఆరోపించారు. భూముల రికార్డుల విషయమై ఐనవోలు తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించినప్పటికీ సరైన సమాధానం లభించలేదని బాధితులు తెలిపారు. ఆర్టీఐ దరఖాస్తులకు కూడా రికార్డుల్లో వివరాలు లేవని సమాధానం వస్తోందని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం లేదా అండదండల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ భూములు తిరిగి ఇవ్వాలని అడిగితే అక్రమ కేసులు పెడతామని, కోర్టు నోటీసులతో వేధిస్తామని బెదిరిస్తున్నారని బాధితులు తెలిపారు. రాజకీయంగా ప్రభావశీలుల అండ ఉందని చెప్పుకుంటూ భయపెడుతున్నారని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ముందు సామూహిక ఆందోళనలు చేపడతామని, భూములు తిరిగి వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని బాధితులు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన రావాల్సి ఉంది.





# నల్లబెల్లి ఎస్సైపై ఆరోపణలు

**స్వతంత్ర విచారణ కోరిన జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్**



**వరంగల్, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కమిషనరేట్ పరిధిలోని నర్సంపేట డివిజన్, దుగ్గొండి సర్కిల్ నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక ఎస్సైపై పలు ఆరోపణలు వినిపిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఒక ఎస్టీ మహిళను వేధించారనే ఆరోపణలపై ఎస్సీ--ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై ఇప్పటివరకు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారన్న విషయంపై అధికారిక స్పష్టత లేకపోవడం చర్చనీయాంశమైంది. స్థానిక ప్రజలు, మేధావులు ఆరోపణలపై నిజానిజాలు వెలికితీసి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆరోపణలు అసత్యమైతే అధికారికంగా ఖండించాలని, నిజమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఉన్నతాధికారులకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన ఫిర్యాదులు తిరిగి వచ్చినట్లు ప్రచారం జరుగుతుండడం కూడా చర్చకు దారి తీసింది. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నర్సంపేట కార్యాలయం మూసివేసి ఉందని పేర్కొంటూ పోస్టు తిరస్కరించబడిందనే సమాచారం ప్రజల్లో సందేహాలకు కారణమవుతోంది. ఈ ఘటనపై అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ స్పందిస్తూ, ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఐపీఎస్ అధికారి లేదా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టాలని సూచించారు. జర్నలిస్టులు వాస్తవాలు రాసినందుకు వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం వంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో ఎస్టీ మహిళ ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు ఏమిటి, సంబంధిత ఎస్సైపై శాఖాపరమైన విచారణ ప్రారంభమైందా, పోలీస్ కమిషనర్ కార్యాలయం అధికారికంగా స్పందిస్తుందా అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం నిలవాలంటే ఆరోపణలపై పారదర్శక విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

# తెలంగాణ పంచాయతీలకు శుభవార్త

**కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల**
**వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల**
**రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల**
**పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# పదేళ్లు నేనే సీఎం..నాకు పోటీ లేదు

**ఢిల్లీలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**
**వచ్చే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న రేవంత్ రెడ్డి**
**ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చివరి దశకు చేరిందని వెల్లడి**
**కిషన్ రెడ్డి కోరితే సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటన**
**కేసీఆర్‌ను జైల్లో పెట్టాల్సిన అవసరం లేదన్న సీఎం**
**జూబ్లీహిల్స్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన**


**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడుతూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చివరి దశకు చేరుకుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో తాము పూర్తిగా ఆధారాల ప్రకారమే ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరితే సీబీఐ విచారణ జరిపించేందుకు కూడా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ మేరకు కేంద్రానికి లేఖ రాస్తామని సవాల్ విసిరారు. ఇటీవలే ఈ కేసులో సిట్ అధికారులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులను విచారించిన నేపథ్యంలో సీఎం వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. "కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు" అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. 2029లో దేశవ్యాప్తంగా 'జమిలి' ఎన్నికలు జరుగుతాయని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, జూబ్లీహిల్స్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ జాతీయ నాయకుడని, ఆయనకు సరిహద్దులు లేవని కొనియాడారు. ఈ ప్రకటనను రాజకీయ వర్గాలు వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషిస్తున్నాయి.

# ఇసుక తరలింపుపై డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలు

**ముగ్గురు విలేకరులపై కేసు**

**మంచిర్యాల జిల్లా, 12 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




జన్నారం మండలం కొత్తపేట గ్రామంలో సొంత ఇంటి నిర్మాణానికి ఇసుక తరలిస్తున్న వ్యక్తిని డబ్బులు ఇవ్వాలని బెదిరించారన్న ఫిర్యాదుతో ముగ్గురు విలేకరులపై జన్నారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తపేట గ్రామానికి చెందిన సునావత్ విజేష్ తన ఇంటి నిర్మాణం కోసం కొత్తపేట వాగు నుండి ఇసుక తీసుకెళ్తుండగా, కవ్వాల్ గ్రామానికి చెందిన తుడుం జితేందర్ (జనం పవర్), అంబటి శరత్ (పోరు తెలంగాణ), కొత్తపేట గ్రామానికి చెందిన దాసండ్ల నవీన్ (చార్మినార్ ఎక్స్‌ప్రెస్) అనే విలేకరులు గత 15 రోజులుగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని విజేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం, ఇసుక తీసుకెళ్తున్న సమయంలో ఫోటోలు తీస్తూ, ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని, లేనిపక్షంలో ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తామని, పత్రికల్లో వార్తలు ప్రచురిస్తామని బెదిరించినట్లు బాధితుడు ఆరోపించాడు. గురువారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో ట్రాక్టర్‌లో ఇసుక తీసుకువస్తుండగా కొత్తపేట గ్రామ శివారులో అడ్డగించి మళ్లీ బెదిరించినట్లు విజేష్ పోలీసులకు తెలిపారు. ఈ విషయమై విజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తుడుం జితేందర్, అంబటి శరత్, దాసండ్ల నవీన్‌లపై కేసు నమోదు చేసినట్లు జన్నారం ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తత

**హోంగార్డులపై జగ్గారెడ్డి వ్యాఖ్యలపై**
**తెలంగాణ హోంగార్డ్ సంక్షేమ సంఘం తీవ్ర ఆగ్రహం**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 13 (జై భీమ్ న్యూస్) :**

సంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 34వ డివిజన్ (ఇందిరానగర్)లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సిబ్బందిపై మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి దుర్భాషలాడిన ఘటనపై తెలంగాణ హోంగార్డ్ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల అశోక్ విడుదల చేసిన ప్రకటనలో, ఎన్నికల కమిషన్, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల మనోభావాలను దెబ్బతీసేలా జగ్గారెడ్డి మాట్లాడినట్లు ఆరోపించారు. "సమాజ సేవ, ప్రజల రక్షణ కోసం అహోరాత్రులు శ్రమించే హోంగార్డులు అనేకమంది తమ ప్రాణాలను అర్పించారు. అధికారుల ఆదేశాలను పాటిస్తూ విధుల్లో ఉన్న కిందిస్థాయి ఉద్యోగులపై రాజకీయ నాయకులు బెదిరింపులకు గురిచేయడం బాధాకరం" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని యావత్ తెలంగాణ హోంగార్డుల తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపిన అశోక్, జగ్గారెడ్డి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "ఇది నా మీద దాడి కాదు – ఈ దేశ రక్షకుడిపై దాడి. వ్యక్తి పై కాదు, నిన్ను కాపాడే వ్యవస్థపై దాడి" అని హోంగార్డుల ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ ఘటన సంగారెడ్డి 34వ వార్డులో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ అభ్యర్థి, సీఐ శివకుమార్ మధ్య వాగ్వాదం, తోపులాటల నేపథ్యంలో జరిగినట్లు తెలుస్తోంది. జగ్గారెడ్డి పోలీసులు, హోంగార్డులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భంలో ఈ వ్యాఖ్యలు జరిగాయని స్థానిక మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) కూడా సీరియస్ అయి, జగ్గారెడ్డిపై కేసు నమోదు చేయాలని సంగారెడ్డి ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. హోంగార్డులు ఎన్నికల వంటి కీలక సందర్భాల్లో నిర్విఘ్నంగా విధులు నిర్వహించేందుకు సహకరిస్తారని, వారి గౌరవాన్ని కాపాడాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ విషయంపై ఇరువర్గాల నుంచి వివరణలు రావాలని పరిస్థితి ఉంది.

# అమెరికాలో మృతి చెందిన కర్నూలు యువతి కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం

**29 మిలియన్ డాలర్ల పరిహారం ఇచ్చేందుకు సియాటెల్ ఒప్పందం**
**2023 జనవరి 23న రోడ్డు దాటుతుండగా పోలీసు వాహనం ఢీకొని జాహ్నవి మృతి**
**సియాటెల్ సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల**

**కర్నూలు, జై భీమ్ న్యూస్**

అమెరికాలో పోలీస్ అధికారి నిర్లక్ష్యంతో మృతి చెందిన కర్నూలు అమ్మాయి జాహ్నవి కందుల(23) కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల భారీ పరిహారాన్ని ఇచ్చేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇది మన భారత కరెన్సీలో సుమారు రూ.262 కోట్లు. 2023 జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న జాహ్నవిని పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టడంతో ఆమె మృతి చెందారు. ఈ మేరకు సియాటెల్ సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ ప్రకటన విడుదల చేశారు. జాహ్నవి కందుల మృతి చాలా బాధాకరమని, ఈ పరిహారంతో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని తన ప్రకటనలో పేర్కొన్నారు. అయితే దీనిపై జాహ్నవి కుటుంబం నుంచి స్పందన రావాల్సి ఉంది. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలు గత వారం కోర్టులో దరఖాస్తు దాఖలు చేశాయి. జాహ్నవి సౌత్ లేక్ యూనియన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ కోసం 2021లో అమెరికా వెళ్లారు. 2023లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనం వేగ పరిమితి 40 కిలోమీటర్లుగా ఉండగా, పోలీసు అధికారి 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపాడు. దీంతో జాహ్నవి 100 అడుగుల దూరంలో ఎగిరిపడ్డారు. ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి జాహ్నవి మృతిపై నాడు జోకులు వేయడం వివాదాస్పదమైంది. "ఆమె చనిపోయింది. చాలా మామూలు మనిషి. 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది" అంటూ నవ్వాడు. ఈ వ్యాఖ్యలపై నాడు భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికాలోనూ ఆయన తీరుపై వ్యతిరేకత వచ్చింది. దీంతో ఆ అధికారిని విధుల నుంచి తొలగించారు.



# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!




వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

# అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే




శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుళ్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




# గాయకుడు ఉదిత్ నారాయణ్‌పై మొదటి భార్య ఫిర్యాదు

**చెకప్ కోసమంటూ ఆసుపత్రికి తీసుకువెళ్లి గర్భాశయాన్ని తొలగించారని ఫిర్యాదు**
**బీహార్‌లోని సుపాల్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**
**గత ఏడాది మహిళను ముద్దు పెట్టుకోవడంతో వివాదంలో చిక్కుకున్న ఉదిత్ నారాయణ్**

ప్రముఖ బాలీవుడ్ గాయకుడు ఉదిత్ నారాయణ్‌పై ఆయన మొదటి భార్య రంజన ఝా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 1996లో చెకప్ కోసమంటూ తనను ఆసుపత్రికి తీసుకువెళ్లి తన అనుమతి లేకుండానే గర్భాశయాన్ని తొలగించారని బీహార్‌లోని సుపాల్‌లో గల మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఉదిత్ నారాయణ్‌తో పాటు ఆయన ఇద్దరు సోదరులు సంజయ్ కుమార్ ఝా, లలిత్ నారాయణ్ ఝా, రెండో భార్య దీపా నారాయణ్‌పై ఆమె ఆరోపణలు చేశారు. ఉదిత్ నారాయణ్ గత ఏడాది కూడా వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. కాన్సర్ట్‌లో భాగంగా తనతో ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపించిన మహిళా అభిమానిని ఆయన ముద్దు పెట్టుకోవడం చర్చకు దారి తీసింది. విమర్శలు రావడంతో ఉదిత్ నారాయణ్ వివరణ ఇచ్చారు. ముద్దు పెట్టడంలో తనకు వేరే ఉద్దేశం లేదని, అభిమానులపై ఉన్న ఆప్యాయతతో అలా చేశానని పేర్కొన్నారు.

# లేటు వయసులో పెళ్లి చేసుకోవడంపై నటుడు సుబ్బరాజు స్పందన

**లేటు పెళ్లిళ్లు, విడాకులపై సుబ్బరాజు ఆసక్తికర వ్యాఖ్యలు**
**నీకు ఏదో వస్తుందని చేసుకునేది పెళ్లి కాదన్న సుబ్బరాజు**
**తన భార్యకు అన్నీ ఇవ్వగలననే నమ్మకం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకున్నానని వెల్లడి**



క్యారెక్టర్ ఆర్టిస్టుగా టాలీవుడ్ లో నటుడు సుబ్బరాజు తనదైన ముద్ర వేశారు. 'బాహుబలి 2' ద్వారా దేశ వ్యాప్తంగా కూడా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. నటుడిగా బిజీగా ఉన్న సుబ్బరాజు... చాలా లేటుగా పెళ్లి చేసుకున్నారు. గత ఏడాది నవంబరులో సడెన్ గా పెళ్లి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... పెళ్లిళ్లు లేటుగా ఎందుకు చేసుకుంటున్నారు? విడాకులు ఎందుకు పెరుగుతున్నాయి? అనే విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలామంది ఇంట్లో వాళ్ల ఒత్తిడితోనో, లేదా వయసు పెరిగిపోతోందనో పెళ్లి చేసుకుంటారని సుబ్బరాజు అన్నారు. ఇది కరెక్ట్ కాదని చెప్పారు. నీకు ఏదో వస్తుందని చేసుకునేది పెళ్లి కాదు... నీ భాగస్వామికి నీవు ఏమి ఇవ్వగలవనే దానిపై నీ పెళ్లి ఆధారపడి ఉండాలని అన్నారు. భాగస్వామిపై పెట్టుకునే భారీ అంచనాలే పెళ్లిళ్లు పెటాకులు కావడానికి కారణమని చెప్పారు. తన భార్య అలా ఉండాలని, తన భర్త అలా ఉండాలని ఊహించుకుంటారని, పెళ్లయిన తర్వాత వాస్తవం అలా లేకపోతే మనస్పర్థలు మొదలవుతాయని అన్నారు. తన భార్యకు తన సర్వస్వం ఇవ్వగలను అని నమ్మకం వచ్చిన తర్వాతే తాను పెళ్లి చేసుకున్నానని చెప్పారు.

# రవి నా జీవితంలోకి వచ్చిన తర్వాత నా ప్రపంచమే మారిపోయింది: కెనిషా



ప్రముఖ కోలీవుడ్ నటుడు జయం రవి, గాయని కెనిషా రిలేషన్ లో ఉన్నారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. పలు సందర్భాల్లో వీరిద్దరూ అత్యంత సన్నిహితంగా కనిపించారు. తాజాగా, కెనిషా ఈ నెల 7న తన పుట్టినరోజు వేడుకలను రవితో కలిసి జరుపుకుంది. ఆ సందర్భంగా దిగిన ఫొటోలను తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసింది. అంతేకాదు, జయం రవి గురించి భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టింది. తనను చిన్నప్పటి నుంచి ఎవరూ ఒక మనిషిగా గుర్తించలేదని కెనిషా ఆవేదన వ్యక్తం చేసింది. ప్రతి ఒక్కరూ తనను దూరం పెడుతున్నారనే భావన తనలో ఉండేదని చెప్పింది. వారి నుంచి తాను కేవలం కొంత ప్రేమ, గౌరవ మర్యాదలు మాత్రమే కోరుకున్నానని తెలిపింది. జయం రవి తన జీవితంలోకి వచ్చిన తర్వాత తన ప్రపంచమే మారిపోయిందని పేర్కొంది. ఇప్పుడు ఆలోచనలు, వ్యవహారశైలి, ప్రేమ వంటి విషయాల్లో తన ఆలోచనా విధానం కొత్తగా ఉందని తెలిపింది.



# ఎన్నో కష్టాలు పడ్డాను.. కన్నీళ్లు పెట్టుకున్న యాంకర్ స్రవంతి

**ప్రేమించి పెళ్లి చేసుకున్నానన్న స్రవంతి**
**వాళ్లకి ఇష్టం లేకపోవడంతో సినిమాలు మానేశానని వెల్లడి**
**భర్త బిజినెస్ దెబ్బతినడంతో సేల్స్ గర్ల్ గా పనిచేశానన్న స్రవంతి**
**జాబ్ కష్టమనిపించడంతో యాంకరింగ్ కి వచ్చానని వివరణ**
**బన్నీతో చేసిన ఇంటర్వ్యూ 'బిగ్ బాస్' అవకాశం తెచ్చిందని వ్యాఖ్య**

బుల్లితెరపై .. ఈవెంట్స్ లోను సందడి చేసే కొంతమంది యాంకర్స్ కి హీరోయిన్స్ తో సమానమైన క్రేజ్ ఉందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. అలాంటి అతికొద్ది మంది యాంకర్స్ లో స్రవంతి ఒకరు. స్రవంతి గ్లామర్ కీ .. ఆమె మాట తీరుకీ .. నవ్వుకి యూత్ వైపు నుంచి చాలామంది అభిమానులు ఉన్నారు. ఒక రకంగా హీరోయిన్స్ కి ఉండవలసిన లక్షణాలు ఆమెలో ఉన్నాయని భావిస్తుంటారు. అయితే ఆమె మాత్రం యాంకర్ గానే కొనసాగుతూ వెళుతున్నారు. తాజాగా 'గ్రేట్ ఆంధ్ర'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్రవంతి మాట్లాడుతూ .. "నేను హైదరాబాద్ కి వచ్చిన కొత్తలో ఒక వైపున చదువుకుంటూనే మరో వైపున డాన్స్ నేర్చుకునేదానిని. ఒకసారి నేను మా ఫ్రెండ్ తో కలిసి 'మహంకాళి' సినిమా షూటింగుకి వెళ్లాను. అక్కడ జర్నలిస్ట్ గా చేయవలసిన ఆర్టిస్ట్ రాకపోవడంతో నాతో చేయించారు. రోజుకి 3 వేల రూపాయలు ఇచ్చారు. ఇదేదో బాగుందే అనిపించింది. ఆ సమయంలోనే నేను ప్రేమలో పడ్డాను. వాళ్ల ఫ్యామిలీకి ఇష్టం లేదని తెలిసి సినిమాలు మానేశాను" అని అన్నారు. "పెళ్లి తరువాత ఆయన బిజినెస్ దెబ్బతింది. దాంతో నేను జాబ్ చేయవలసి వచ్చింది. ఒక జ్యుయలరీ షాపులో సేల్స్ గర్ల్ గా పనిచేశాను. ఉదయం నుంచి రాత్రి వరకూ కూర్చోకూడదు. అలా ఏడాదిన్నర పాటు పనిచేశాను. ఇక నా వల్ల కాదనిపించి మానేశాను. ఆ తరువాత నుంచి యాంకరింగ్ వైపు వచ్చాను. బన్నీతో చేసిన ఒక ఇంటర్వ్యూ నన్ను 'బిగ్ బాస్'కి తీసుకుని వెళ్లింది. ఆ డబ్బు నాకు చాలా హెల్ప్ అయింది"అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.